
# దీపం చెప్పిన కతలు

గోపిని కరుణాకర్

## పూలరతంలో వచ్చిన పార్వతీపరమేశ్వరులు



దూరంగా,
ఏడు తలల మహాసర్పం కొండలు కొండలుగా చుట్టలు చుట్టుకోని నిద్దరపోతా వుండాది. నెత్తిన చుక్కల కిరీటాన్ని పెట్టుకునింది.

చుక్కలు మిలమిలా మెరస్తా వుండాయి.

ఆరంజ్యోతి చుక్క ఎద్దుపేగుల్ని దండెంమీద ఆరేస్తా వుంటే, తలకోన మూలన బాపనోడు మిణుకు మిణుకుమంటా ఆరంజోతిని తొంగితొంగి చూస్తా వుండాడు.

"ఎద్దుపేగులు ఆరేసుకునే ఆరంజోతిమింద ఈ బాపనోడికి ఎందుకు మనసైనట్లో?" అని అడిగింది పొరుగింటి దీపం.

"ఎందుకంటే ఏం చెప్పేది? పువ్వు మింద తుమ్మెదెందుకు వాలుతుంది? ఇదీ అంతే! నేనేమో అంటరానిదాన్ని. నువ్వేమో జంధెమేసుకున్న బాపనోడివి. నీకు నాకు మనువెట్లా కుదురుతుంది? అంటా ఎద్దుపేగుల్ని దండెం మీద ఆరేసుకుంటా వుండాది చూడు ఆరంజోతి" అని చూపించింది ఇరుగింటి దీపం.

దీపాలు తలెత్తి ఆకాశంలోకి చూసినాయి.

"దానికి బాపనోడు ఏమన్నాడో తెలుసునా? నువ్వు ఆరేసేది ఎద్దుపేగుల్ని కాదు. నేను వొంటిమింద ఏసుకునే జంధెం పోగుల్ని అని అంటా మిణుకు

మిణుకుమంటా వుండాడు'' అని చెప్పింది ఇరుగింటి దీపం.

ఆ మాటకి దీపాలన్నీ పకపకా నవ్వినాయి.

''బాపనాయన పొయ్యి ఆరంజోతిని పెళ్ళి చేసుకోవడమేమిటి? ఇచ్చిత్తరం కాకపోతే'' అనింది గడ్డం మింద చేతిని పెట్టుకోని ఎగవింటి దీపం.

''లోకానికి ఇచ్చిత్తరం కాబట్టే పెళ్ళిలో పిల్లాపిలగోడికి ఆరంజోతిని చూపించేది. వాళ్ళిద్దరి మాదిరి అన్యోన్నెంగా బతకమని అయివోరు చెప్పేది'' అనింది ఇరుగింటి దీపం.

''ఆరంజోతిని చూసినంత మాత్తరాన ఆలూమొగులూ కీసులాడుకోకండా, గీసులాడుకోకండా వుంటారా? యాడన్నా'' అనింది పొరుగింటి దీపం.

''ఆలూమొగుల కొట్లాట ఎంతసేపు? ఆరిక కూడు వుడికినంతసేపే గదా! ఆలూమొగులు అనగానే నాకు 'పూలరతంలో వచ్చిన పార్వతీ పరమేశ్వరుల కత' గుర్తుకొస్తా వుండాది'' అనింది ఇరుగింటి దీపం.

> ''ఇప్పుడు నేను ఏమన్నానని అట్లా శోకాలు తీస్తా వుండావే! మా తమ్ముని గుండెలమిందనే కూచ్చోనుండాది లచ్చిందేవి. వాడు పారిజాతం పువ్వుని కాదు గదా, ఆ కొండమింద కోతిని కోరిన తెచ్చి ఇస్తాడు. నా దెగ్గిర ఏముండాది బూడిద'' అని పెళ్ళంమింద విసుక్కున్నాడు పరమేశ్వరుడు.

''ఎట్టెట్టా? పార్వతీపరమేశ్వరులు పూలరతమేసుకుని వచ్చేవాళ్ళా? ఎవరా ఆలూమొగులూ? ఏమా కత?'' అని అడిగింది పొరుగింటి దీపం.

''ఇది గంజి కరువులో జరిగిన కత'' అని కత చెప్పడం మొదలెట్టింది ఇరుగింటి దీపం.

* * *

వాళ్ళది సంతోపుకాడ వుండే మేళ్ళోళ్ళపల్లె.

మొగుని పేరు మేళ్ళ సిద్దయ్య.

పెళ్ళాం పేరు గోపిని నడిపక్క.

వాళ్ళు ఎంత అన్యోన్నెంగా వుండేవాళ్ళంటే! ఆనోటా ఈనోటా కైలాసంలో వుండే పార్వతీపరమేశ్వరులకి గూడా వాళ్ళ గురించి తెలిసిపోయింది.

ఒగరోజు పార్వతీదేవి మొగునితో అనిందిగదా!

''ఏమే ఏమే... లోకానికంతా మనమే అనుకుంటే మనకి మించినోళ్ళు భూలోకంలో వుండారంట. వాళ్ళని ఎప్పుడెప్పుడు చూద్దామా అని వుండాది. బిడ్డల్ని చూసిగూడా శానారోజులైపాయింది గదా! అట్నే తిరుత్తణికి పొయ్యి చిన్నోడి దెగ్గిర రెండు రోజులు, కాణిపాకం పొయ్యి పెద్దోడి దెగ్గిర రొండు రోజులు వుండేసి వద్దాము'' అని మొనుసులో మాటని బయటపెట్టింది పార్వతీదేవి.

బుట్టలో నుంచి పామును తీసి మెళ్లో వేసుకుంటా,

''పామును తీసి మెళ్లో వేసుకోవచ్చు. పెళ్ళాం మాటకి అడ్డు చెప్పేదానికి వీల్లేదు. చెప్పినాననుకో కండ్లతోనే కాటేస్తావ్'' అన్నేడు పరమేశ్వరుడు ఎగతాళి పడతా.

''ఈ ఎగసెక్కేలేకేం కొదవలేదు. కట్టుకున్నప్పట్నుంచి చూస్తా వుండాను. నిన్ను అడిగితేనే గాని నీకు నువ్వుగా ఏ పొద్దున్నా మూరడు మల్లెపూలు తెచ్చిచ్చినావా? నీకంటే మా మరిది మేలుగదా! పెళ్లాం కోరతానే పారిజాతం పువ్వుని కోసుకోని పొయ్యి ఇచ్చినాడు. నిన్ను కట్టుకున్నందుకు నేను ఏం సుఖపడినాను?'' అని శోకాలు తీసింది పార్వతీదేవి.

''ఇప్పుడు నేను ఏమన్నానని అట్లా శోకాలు తీస్తా వుండావే! మా తమ్ముని గుండెలమిందనే కూచ్చోనుండాది లచ్చిందేవి. వాడు పారిజాతం పువ్వుని కాదుగదా, ఆ కొండమింద కోతిని కోరిన తెచ్చి ఇస్తాడు. నా దెగ్గిర ఏముండాది బూడిద'' అని పెళ్ళంమింద విసుక్కున్నాడు పరమేశ్వరుడు.

''నా బతుక్కి ఆ బూడిదే మిగిలింది తల్లే! మాయమ్మా, మా నాయనా బిచ్చమెత్తుకునేవాడ్ని వొద్దువొద్దంటా వుంటే నిన్ను పెళ్ళి చేసుకున్నాను చూడు. అందుకు నన్ను నేను మెట్టుతో కొట్టుకోవల్ల'' అని ఇంగా పెద్దగా శోకాలు తీసింది.

''పాముని మెళ్ళో ఏసుకోవచ్చు. బుద్ధుంటే ఆడదాని మెళ్ళో తాళి కట్టగూడదు. లెయ్యి లెయ్యి చీరకట్టుకోని పయనమవ్వు. భూలోకానికి పొయ్యొద్దాం'' అన్నేడు దిగజారిపోతున్న పాముని మెళ్లో ఎగేసుకుంటా.

ఆ మాటతో ఏడుపు ఆపేసి సంతోషంగా చీర కట్టుకోని పయనమైంది పార్వతీదేవి.

భూలోకానికొచ్చి నక్కబండమింద పూలరతాన్ని దింపినాడు పరమేశ్వరుడు.

ఆ బండకాడ్నే చేనుకి కల్లేసుకుంటా (కంచె) వున్నేరు సిద్దయ్య, నడిపక్క.

ఈ వేషాలతోపోతే అడుక్కునే దానికి వచ్చిన పగటివేషగాళ్ళనుకుంటారని కుందేళ్ళుగా మారిపొయ్యి బిక్కిపొదల్లోకి దూరినారు పార్వతీ పరమేశ్వరులు. బిక్కిపొండ్లు తింటా వాళ్ళనే గెవనిస్తా వుండారు.

సిద్దయ్య కంపచెట్లను కొడతా వుంటే, కంపగాల కట్టెతో ఎత్తుకోని పొయ్యి కల్లేస్తా వుండాది నడిపక్క.

సిద్దయ్య వాసం మాదిరి పొడుగ్గా, బక్కగా, ఎర్రగా వుండాడు.

నడిపక్కది నన్నెలుపు, పెద్దపెద్ద కండ్లు, జడ పిర్రలమింద నుంచి జారి బుసపెడతా వుండాది. రొమ్ములు ఉలితీసుకోని చెక్కినట్టు గుండ్రంగా దానిమ్మ పొండ్లు మాదిరి వుండాయి. కళ కలిగిన మొగం నడిపక్కది.

వాటారిన ఎండలో మొగం చిట్లించుకోకుండా కల్లేసుకుంటా వుండారు.

యాడవున్నిందో,

నాగదారి ముల్లు 'పటక్కమని' నడిపక్క కాళ్ళో ఇరిగింది. ''అబ్బా'' అని కంపగాల కట్టెని ఇసిరేసి మోకాళ్ళమింద కుర్చునింది. సిద్దయ్య పరిగెత్తుకుంటా వచ్చినాడు. నడిపక్క కళ్ళల్లో నీళ్ళు తిరిగినాయి.

కుర్చోని ముల్లు ఇరిగిన కాలుని వొళ్ళో పెట్టుకున్నాడు సిద్దయ్య, ముల్లు కుట్టేదానికి పిన్నీసుని తీసుకున్నేడు.

''వొద్దొద్దు... నొప్పికి తట్టుకోలేను'' అని కాలుని ఎనక్కి తీసుకునింది.

''కండ్లు మూసుకో నొప్పి తెలీకుండా ముల్లు కుట్టేస్తాను'' అన్నేడు సిద్దయ్య.

నడిపక్క గట్టిగా కండ్లు మూసుకుని పాణాన్ని బిగపట్టింది.

ఏమాత్తరం నొప్పి అనేది తెలియకుండా కంట్లో నలుసుని తీసినంత జాగర్తగా కాళ్ళో ముల్లుని కుట్టేసి నడిపక్క చేతిలో పెట్టినాడు.

''దొంగనాబట్ట ముల్లు... ఎంత నొప్పి పెట్టిందమ్మా!'' అని అరిచేతిలోని ముల్లుని చూస్తా తిట్టింది.

''నా ముద్దుల పెళ్ళాం కాళ్లో ఇరిగి కంట్లో నీళ్ళు తెప్పిస్తావా? నిన్నేం చేస్తానో చూడు!'' అని ముల్లుని తీసుకోని ఎండిపోయిన దంతి ఆకుకి గుచ్చినాడు.

ఆ దంతి ఆకుని చెత్తాచెదారంలో ఏసి అగ్గి పెట్టినాడు. ముల్లు కాలి బూడిదైంది.

అప్పటికి ముల్లు మింద కసి తీరింది సిద్దయ్యకి.

బిక్కి పొదల్లో తొంగితొంగి ఇదంతా గెవనిస్తా వుండిన పార్వతీ పరమేశ్వరులు మొగాలు చూసుకోని కిసుక్కున నవ్వుకొన్నేరు.

''భలే వుంది సంబడం... పెళ్ళామంటే ఇంత పిచ్చా! నువ్వూ వుండావు ఎందుకూ? ఏ పొద్దన్నా కాలుని వొళ్ళో పెట్టుకోని ముల్లు కుట్టినావా?'' అని మొగునిమింద వొంటి కాలిమింద లేసింది పార్వతీదేవి.

''నోరు తెరిస్తే చాలు కొట్టాడేదానికి లేసికుచ్చుంటావు. గొబ్బు నాయాలి ముండా! నీకు ముల్లు ఇరిగితేగదా నేను కుట్టిసచ్చేదానికి'' అని కొట్లాటకి దిగినాడు పరమేశ్వరుడు.

పెళ్ళాన్ని చెట్టునీడన కూర్చోబెట్టి ఒగడే కంపకొట్టుకుంటా, కల్లేసుకుంటా వుండాడు సిద్దయ్య.

కీసులాడుకుంటా, గీసులాడుకుంటా పార్వతీ పరమేశ్వరులు పూలరతమెక్కి పెద్దకొడుకు దెగ్గిరికి కాణిపాకం పొయినారు.

* * *

ఇంగొకరోజు,

మల్లా పూలరతమేసుకోని వచ్చినారు పార్వతీపరమేశ్వరులు. రతాన్ని సంతోపులో చింతమాకుల మింద దింపినారు.

ఇద్దరూ ఇంటి గువ్వలై ఎగురుకుంటా పొయ్యి నడిపక్క వాళ్ళ ఇంటి గవాక్షం మింద వాలినారు.

ఇంటి చూరులో గూడుకట్టుకున్నారు. ఆ గూట్లో కూర్చోని ఆలూమొగులను గెవనిస్తా వుండారు పార్వతీపరమేశ్వరులు.

మేళ్ళ సిద్దయ్యకి ముండమోపులైన తల్లీ, తోబుట్టువు వుండారు. వగిసిలోనే మొగుడు సచ్చిపోతే తమ్ముడి పంచన చేరింది తోబుట్టువు. సిద్దయ్య, నడిపక్క ఆడుకుంటా పాడుకుంటా కుశాలగా వుండడం తల్లికీ, తోబుట్టువుకీ నచ్చేదిగాదు.

కండ్లల్లో నిప్పులు పోసుకునేవాళ్ళు.

ఒగరోజు నడిపక్క మింద లేనిపోని చాడీలు చెప్పినారు. ఎవడ్నో మరిగిందనీ, వానికి చేనుకాడ

కొంగేస్తా వుండాదనీ, ఏవేవో వున్నవీ లేనివీ కైగట్టి చెవులో వూదినారు. తల్లీ, తోబుట్టువు ఎన్ని చాడీలు చెప్పినా విన్నట్టే వున్నాడుగాని చెవులో ఏసుకోలేదు.

''సరే మీరు చెప్పింది నిజమైతే నా పెళ్ళాన్ని సున్నంలో ఇడగబోసి సంపేస్తాను. మీకు ఇష్టమేనా?'' అని పైగుడ్డ ఇదిలించుకోని పైకి లేచినాడు.

నడిపక్క కంటే ముందుపొయ్యి చేనుకాడ గుబురుగా వుండే రెప్పాలమానులో కూర్చొని గెవనిస్తా వుండాడు సిద్దయ్య. రెండు బార్ల పొద్దు ఎక్కినాక ఎద్దుల్ని పట్టుకోని వచ్చింది నడిపక్క.

ఎద్దులు కటవన గెడ్డి మేస్తావుండాయి.

తొలికి తీసుకోని చెనిగిచేన్లో వంగింది నడిపక్క.

పొద్దున నడుము వంచిందీ, పొద్దుగూకినాకనే ఎత్తింది. పక్కన పిడుగు పడినా పట్టించుకోకుండా తన పనేదో తను చేసుకుంటా వుండిపొయింది.

''మేలిమి బంగారం లాంటి నా పెళ్ళాం మింద నిందలేస్తారా? లంజిలాల! మీ పని రాత్తిరికి చెప్తాను'' అని తల్లినీ, తోబుట్టువునీ తిట్టుకుంటా పొద్దు గూకినాక మానుదిగి ఇంటికొచ్చినాడు సిద్దయ్య.

పొగులంతా కష్టంచేసి ఇంటికొచ్చింది నడిపక్క.

వుడుకుడుగా కాంచుకోని వొళ్లు నొప్పులకి సగించినట్టుగా నీళ్ళు పోసుకుంటా వున్నింది.

''అత్తా... కొంచెం ఈపురుద్దిపో?'' అని అత్తని పిలిచింది.

ఆ చెవిటి దానికి ఈ మాట వినిపించలేదు.

తిన్నెమింద కుర్చోని బీడీ తాగతావుండే సిద్దయ్య విని, నవ్వుకుంటా పెళ్ళాం వీపు రుద్దేదానికి లేచిపాయినాడు. సయిగ్గా పిల్లిమాదిరి ఎనకనుంచి నడుచుకోని పొయ్యి వీపుమింద చేతులేసినాడు.

అత్తే అనుకుని రుద్దుడు రాయి మొగుని చేతికిచ్చింది నడిపక్క.

రాయి తీసుకోని వీపు రుద్దతా వుండాడు సిద్దయ్య.

వీపంతా తడిమింది.

నడుమంతా తడిమింది.

మెడనంతా తడిమింది

రాయితో రుద్దతా వుంటే వొంటిమింద నెమిలీక పారాడినట్టు సగించినట్టుగా వుండాది నడిపక్కకి. రెప్పపాటు కండ్లు మూతలు పడినాయి.

సిద్దయ్య చేతిలోని రాయి రొమ్ముల మిందగా జారి కిందపడింది.

ఉలిక్కిపడి మొగుడ్ని చూసింది.

సిగ్గుతో వొంటిని బిగదీసుకుని మోకాళ్ళ మద్దిన మొగాన్ని దాచుకునింది.

''ఎందుకంత సిగ్గు? మొగుడ్నే గదా!'' అన్నేడు నవ్వతా సిద్దయ్య.

''మొగుడైతే సిగ్గుండదా! ఎవరైనా చూస్తే ఏమనుకుంటారు? ఇడిచేసిన ఆడది మొగునిచేత ఈపు రుద్దించుకునింది అనరూ?'' అనింది మోకాళ్లలో మొగాన్ని దాచుకునే.

''ఎవురేమనుకుంటే నాకేమి? నాపెళ్ళాం... నా యిష్టం. వీపన్నా రుద్దతాను. వీపుని విమానం మోతైనా మోగిస్తాను. అయినా... నేను నీళ్ళు పోసుకుంటా వుంటే వచ్చి వీపు రుద్దుతావు. తలంటి స్నానం చేయిస్తావు. నేను నీకు వీపు రుద్దగూడదా? మీ ఆడోళ్లు భలే కుళ్ళుబోతు లంజిలు. మొగుళ్ళచేత వీపు రుద్దించుకుంటే మీ సొమ్మేమి పోతుంది? మీ బంగారు గనిని చూసేస్తామని కుళ్ళుబోత్తనం మీకు'' అన్నేడు సిద్దయ్య.

''సామి... పో సామి. నీకు దండం పెడతాను'' అని అడుక్కునింది నడిపక్క.

''సరె పోతాలేగాని... ముందు రెండు చేతులతో దండంపెట్టు'' అన్నేడు.

రెండు చేతులు ఎత్తి దండం పెట్టబొయ్యి ''ఆ... నేను పెట్టను'' అని సిగ్గుపడిపోతా మోకాళ్ళ మద్దిన మొగాన్ని దాచుకునింది.

''అయితే... నేను పోను'' అని మొండికేసి చేతులు కట్టుకోని నిలబడినాడు.

ఇంతలో,

''ఎంతసేపమ్మే... నీళ్ళు పోసుకునేది. పొయ్యిమింద పెట్టిన కూర మాడిపోతా వుండాది'' అని అత్త ఇంట్లోనుంచి అరిచింది.

''కూర మాడిపోతా వుండాది. నేను పోవల్ల పోబ్బా! నీకు దండం పెడతాను'' అనింది.

''పెట్టు... పోతాను'' అన్నేడు ముదిగారంగా.

మొండోడు రాజుకంటే బలవంతుడు గదా!

చేసేదేమీ లేక నవ్వు మొగాన్ని ఆపక్క పెట్టుకోని రెండు చేతులు పైకెత్తి దండం పెట్టింది.

వానొచ్చినప్పుడు కొర్రొడ్డినట్టుండాది (ఇంద్రధనస్సు) నడిపక్క. వొంపువొంపులో ఎన్నో వన్నెలూ! చిన్నెలూ! తడిసిన చెట్టు మాదిరి సిగ్గుతో వొణకతా వుండాది.

ముసిముసి నవ్వులు నవ్వుకుంటా ఆన్నుంచి ఇంట్లోకి పొయినాడు సిద్దయ్య.

గవాక్షం మింద వాలి ఇదంతా గెవనిస్తా వుండిన పార్వతీ పరమేశ్వరులకి వొళ్ళు ఎచ్చబడి పొయ్యి చెమట్లు పోసేసినాయి.

సంగటి తిని దీపాలు ఆర్పేసినారు.

తల్లీ, తోబుట్టువు పొద్దున సిద్దయ్య చెవిలో అగ్గిపుల్ల గీసినారు గదా! అది ఈపాటికి పెనుమంటై రగులుకోని వుంటుందని కుశాలపడిపొయినారు. పాపం... వాళ్లు అనుకొనింది ఒగటైతే జరిగింది ఇంగొకటి.

సిద్దయ్య, నడిపక్క తలుపేసుకోగానే పరిగెత్తుకుంటా గవాక్షం దెగ్గిరికి వచ్చేసేవాళ్ళు తల్లీ, తోబుట్టువు. వాళ్ళు ఏం మాట్లాడుకుంటా వుండారోనని చీకట్లో నిలబడి దొంగచాటుగా వినేవాళ్ళు. ఇదంతా సిద్దయ్య ఒగకంట గెవనిస్తానే వుండాడు.

ఆరాత్తిరి గూడా వాళ్ళు తలుపేసుకోగానే గవాక్షం దెగ్గిరికి వచ్చేసినారు

ఆముద దీపం గుడ్డిగా ఎలగతా వుండాది.

''మ్మేయ్ నడిపక్కా! ఈ పొద్దు ఎందుకో నోరు పండేట్టుగా వక్కాకు ఏసుకోవల్లని మొనుసైతా వుండాది'' అన్నేడు సిద్దయ్య.

బొడ్లోనుంచి వక్కాకు తిత్తి తీసి చిలకను చుట్టి ఇచ్చింది.

నమలతా,

''చానా రోజులుగా చూస్తా వుండాను. మనం మంచమెక్కగానే ఆ గవాక్షం మింద వొదిగిన ఇంటి గువ్వలు మనల్నే గెవనిస్తా వుంటాయి. మనం ఏం మాట్లాడుకుంటే ఈ లంజిగువ్వలకి ఎందుకు చెప్పు?'' అన్నేడు సిద్దయ్య.

ఆ మాటతో పార్వతీ పరమేశ్వరులు ఉలిక్కిపడి గవాక్షం మింద నుంచి ఎగిరి గూట్లో వాలినారు.

తల్లీ, తోబుట్టువు మొగాలు చూసుకొన్నేరు.

ఎర్రగా పండిన నాలికని బయటపెట్టి,

''నీ చేత్తో చిలకని చుట్టిస్తే నా నోరు పండింది. నువ్వు అడుగుపెట్టిన వేళావిశేషం చాలామంచిది. నా బతుకు పండింది. ఈ ఇంటి గువ్వలేగాదు మనల్ని చూస్తే ఆ పార్వతీ పరమేశ్వరులే కుళ్ళుకోని



## గరం... గరం... గర్ల్‌ఫ్రెండ్!!

అనుకున్నంతా అయింది... ''నా సినిమా కథ స్వలింగసంపర్కులకు సంబంధించిందహో'' అంటూ టమకు వేసుకున్న కరన్ రజ్దాన్ చిత్రం 'గర్ల్‌ఫ్రెండ్' ఇప్పుడు శివసేన – బిజెపిల ఆగ్రహానికి గురయింది. చాలాచోట్ల ఆ సినిమా ప్రదర్శనలను సంఘపరివారం అడ్డుకుంటోంది. 'ఫైర్' తరువాత మళ్లీ అలాంటి సంచలనం సృష్టించాలని కరన్ కావాలనే ఇలాంటి ప్రచారం చేశాడని ముంబై సినిమా పెద్దలు అంటున్నారు. కరన్ కోరిందే జరుగుతోంది. ఇప్పుడా సినిమాకు శాటిలైట్ రైట్సూ, ఓవర్సీస్ రైట్సూ బ్రహ్మాండంగా పలుకుతున్నట్టు భోగట్టా. అన్నట్టీ కరన్‌ను గుర్తుపట్టారుగా? మిథున్ చక్రవర్తి డిస్కోడాన్సర్ సినిమాలో అతనితో పోటీపడిన డాన్సర్.

చస్తారు'' అన్నేడు.

ఆ మాటకి పార్వతీపరమేశ్వరులు కిసుక్కున నవ్వుకొన్నేరు.

తల్లీ, తోబుట్టువు కుళ్ళుకోని చచ్చినారు.

సిద్దయ్య బాగా వక్కాకు నమిలి కొంచెం ముందుకు వంగి కాకరించి తుపుక్కున వూంచి నాడు.

గవాక్షం దెగ్గిర నిలబడుకోనుండే తల్లీ, తోబుట్టువుల మొగాలమింద లటుక్కునొచ్చి, గోడమింద పేడ పడినట్టు పడింది వక్కాకు ఎంగిలి.

''ఏందిరా సిద్దయ్యా నా మొగాన వూంచినావే'' అనింది తోబుట్టువు ఎంగిలి తుడుచుకుంటా.

''ఆడ మిమ్మల్ని ఎవురు నిలబడుకోమన్నేరు. బుద్ధిలేని ఆడంగులాలా!'' అని తిట్టినాడు.

ఆన్నుంచి సయిగ్గా ఎంగిలి తుడుచుకుంటా

బావులూ, చెరువులూ ఎండిపోయినాయి. కుష్టిరోగి మాదిరి నేలనెర్రెలు చీలి పొక్కులు కట్టేసింది. గొడ్లుకట్టు గూటాన నిగిడి సచ్చినాయి. తినేదానికి తిండిలేదు. పల్లెల మింద ఇనుప ముక్కు కాకులు ఎగరతా వుండాయి. ఆకు ఆకుగా దంతి ముల్లుకి కుట్టుకోని జనం బలసాకు తిని బతకతా వుండారు.

యలబారిపోయినారు తల్లీ, తోబుట్టువు.

ఇదంతా గెవనిస్తా వుండిన పార్వతీపరమేశ్వరులు రెపరెపా రెక్కలు కొట్టుకుంటా సంబరపడిపోయినారు.

* * *

ఆపొద్దు పున్నమి.

వెన్నెల్లో ఒడ్లోగూడపట్టినారు సిద్దయ్య, నడిపక్క. వాళ్ళపూట నడిజాములో వచ్చింది. ఆ పూటలోనే వాళ్ళు మడికి నీళ్ళు పారగట్టుకోవల్ల.

తొణికి లేస్తా నీళ్ళు కాలవింటి పరుగులు పెడతా వుండాయి.

పూలరతంలో వచ్చిన పార్వతీపరమేశ్వరులు రతాన్ని చెరువు కట్టమింద దింపినారు. గోందిరిక ప్పల్లె బండకింద నక్కి గూడేస్తావుంటే వాళ్ళనే గెవనిస్తా వుండారు.

ఎండాకాలం గదా!

నాలుగు గూడలు ఎత్తేసరికి చెమటలు పోసేసినాయి. వొళ్ళంతా కసకసాని వుండాది. పెతిసారి ఆడగోక్కోనూ, ఈడ గోక్కోనూ, ఆడ తుడుసుకోనూ, ఈడ తుడుసుకోనే సరిపోతా వుండాది. గూడేసేదానికి కష్టంగా వున్నింది.

ఇట్లా కాదని చెప్పి ఇద్దరూ ఏం చేసినారంటే గుడ్డలు గుంజి ఆడపారేసి బిత్తలతో గూడెయ్యడం మొదలెట్టినారు. కొంచేపు కుశాలగా చెర్లో ఈతకొట్టడం. కొంచేపు కుశాలగా గూడెయ్యడం.

వాళ్ళు బిత్తలతో (నగ్నంగా) వెన్నెల్లో గూడ ఏస్తావుంటే సిగ్గుపడిపోయిన పార్వతీపరమేశ్వరులు ఆన్నుంచి మాయమైపోయినారు.

ఇట్లా రోజులు గడస్తా వుండాయి.

నడిపక్క నీళ్ళాడి చెందమామకి దీటుగా పండంటి మగబిడ్డని కనింది. ఆ బిడ్డకి కొండలరాయుడు అని పేరు పెట్టినారు.

ఆ బిడ్డకి మూడోనెల పెట్టింది.

* * *

ఆ సమచ్చురం గంజి కరువొచ్చింది.

బావులూ, చెరువులూ ఎండిపోయినాయి. కుష్టిరోగి మాదిరి నేలనెర్రెలు చీలి పొక్కులు కట్టేసింది. గొడ్లుకట్టు గూటాన నిగిడి సచ్చినాయి. తినేదానికి తిండిలేదు.

పల్లెల మింద ఇనుప ముక్కు కాకులు ఎగరతా వుండాయి.

ఆకు ఆకుగా దంతి ముల్లుకి కుట్టుకోని జనం బలసాకు తిని బతకతా వుండారు.

ఆ పొద్దు ఏమైందంటే,

ఆకలితో ఏడస్తా వుంటే బిడ్డ నోటికి రొమ్ముని అందించింది నడిపక్క. ఆత్తరమాత్తరంగా కుడస్తా వుండాడు గాని పాలధార నోట్లో పడడం లేదు.

రొమ్ములు వొట్టిపోయినాయి.

ఎన్ని రోజులు బలసాకు తిని బతికేది?

తిండి తింటేగదా పుష్టిగా పాలు పడేది.

సలివేంద్రంలో ఒగపూట గంజిపోస్తారు. ఆ గంజిని కుక్కలు కాట్లాడుకొన్నెట్టు కాట్లాడుకుంటా నీకా నాకా అని తల్లీ, తోబుట్టువే తాగేస్తారు.

బిడ్డ గుక్కపట్టి ఏడస్తా వుండాడు. ఎట్లా సముదాయించాలో తెలియటం లేదు.

రాత్తిరికని కొంచెం గంజి వుట్టిమింద దుత్తలో ఎత్తిపెట్టుకున్నేరు అమ్మా, కూతురు. 'దాన్ని ముడితే ఇసాన్ని ముట్టినట్టే గదా!' అనుకునింది నడిపక్క.

బిడ్డని రొమ్ములకి అదుముకోని ఏడస్తా కుర్చునింది.

ఏడ్చీఏడ్చీ బిడ్డ గొంతు పిడచకట్టకపోయింది. కీసుగొంతుతో ఏడస్తా వుండాడు.

ఊపిరి వదిలేస్తాడేమోనని భయమేసింది.

గబుక్కున లేసింది నడిపక్క.

ఉట్టిమింద నుంచి గంజిదుత్త దించింది. నాలుగు గుక్కలు బిడ్డకి తాపించింది. గంజి గొంతులో పడగానే బిడ్డ ఏడుపు ఆపేసినాడు.

కడుపునిండా గంజి తాపింది.

మిగిలిన గంజిని ఉట్టిమింద పెట్టబోతా వుంటే దుత్త జారి కిందపడింది. గంజి అంతా నేలపాలైపోయింది. యాడ వున్నిందో కుక్క వొగటి పరిగెత్తుకుంటా వచ్చి గంజిని నాకతా వున్నింది.

అరువులు చేసేదానికి ఇరుగింటికి పోయిన అమ్మా, కూతురు అప్పుడే ఇంట్లో అడుగుపెట్టినారు. వాళ్ళ కడుపు రగిలిపోయింది.

రాచ్చసులు పడినట్టు నడిపక్క మింద పడి జుట్టు పట్టుకోని ఈడ్చినారు. కొట్టినారు.

ఆ రాత్తిరి.

కొడుకు వస్తానే జరిగిందంతా చెప్పినారు.

'మేము తెచ్చిపెట్టుకున్న గంజి తాగేసిందని' నింద మోపినారు.

జరిగిందేమిటో తెలుసుకోకుండా నడిపక్క మింద చెయ్యి చేసుకున్నాడు సిద్దయ్య. నడిపక్క కండ్లల్లో నీళ్ళు తిరిగినాయి.

గవాక్షం మింద వొదిగి ఇదంతా చూస్తా వుండిన పార్వతీపరమేశ్వరులు నిశ్చలకపోయినారు.

మొగునిమింద కోపంతో గుడ్డలు మూటకట్టుకునింది. పసిబిడ్డని ఎత్తుకునింది. ఈ మారసానివాని పల్లెలో ఆమె చెల్లెలు పెద్దవ్వ వుండాది గదా!

చెప్పాపెట్టకుండా,

పొద్దున్నే చెల్లెలు ఇంటికి వచ్చేసింది.

నడిపక్క అలిగిపొయ్యే గుండికే పార్వతీ పరమేశ్వరులకి ఆ ఇంట్లో వుండాలనిపించలేదు. దిగులు మొగాలేసుకుని పూలరతమెక్కి కైలాసానికి యలబారిపోయినారు.

గంజికరువు వాళ్ళ పచ్చని కాపరంలో అట్లా చిచ్చుపెట్టింది.

మొగునిమింద దిగులుతో నాలుగుపుట్ల జొరంకాసింది.

మూడురోజులు గడిచిపోయినాయి.

పిలుచుకోని పొయ్యేదానికి సిద్దయ్య రాలేదు.

మూడోరోజు పొద్దున్న

నీరెండలో పెద్దింటి గడపమింద తలపెట్టుకోని మగతగా కండ్లు మూసుకోని నిద్దరపోతా వున్నింది. బిడ్డ రొమ్ము కుడస్తా వుండాడు.

''రోకలితో పోటేసినట్టు తల పగిలిపోతా వుండాది. తైలమాకులు నూరి పట్టెయ్యి చెల్లీ!'' అని పెద్దవ్వకి చెప్పింది.

పెద్దవ్వ తైలమాకులు నూరతా వుండాది.

బిడ్డ రొమ్ము కుడస్తానే వుండాడు.

ఎప్పుడు వదిలేసిందో నడిపక్క ఊపిరి వదిలేసింది. నోరు తడవక బిడ్డ గుక్కపట్టి ఏడ్చినాడు.

పెద్దవ్వ పరిగెత్తుకుంటా వచ్చి చూసింది.

నడిపక్క నోరు తెరుసుకోని బిగసకపోయిండాది.

నోట్లో ఊపిరిపోయింది.

ఈ విషయం చెప్పేదానికి ఒగమనిషి పరిగెత్తుకుంటా మేళ్ళోళ్ళపల్లెకి పోయినాడు.

గొడ్డలి తీసుకోని తుండు చీలకొడతా వున్నేడు సిద్దయ్య.

పరిగెత్తుకుంటా పోయిన మనిషి ఎనకాముందు చూసుకోకుండా,

''సిద్దయ్యన్నా... నడిపక్క సచ్చిపోయింది'' అని గబుక్కున అనేసినాడు.

అంతే,

ఎత్తిన గొడ్డలి అట్నే వదిలేసి కిందపడిపొయ్యి కండ్లల్లో ఊపిరి వదిలేసినాడు సిద్దయ్య.

ముత్తయిదువుగా నడిపక్క, పెళ్ళాం సచ్చిపొయిందనే సరికి గుండెపగిలి సిద్దయ్య ఒగేరోజు సచ్చిపోయినారు.

ఇద్దరికీ పక్కపక్కనే పాడి కట్టినారు.

ఇద్దర్నీ పక్కపక్కనే కుర్చోబెట్టి నీళ్ళు పోసినారు.

గుంతలో గూడా ఇద్దర్నీ పక్కపక్కనే పడుకోబెట్టి మన్ను కప్పెటినారు.

అని కళ్ళనిండుకు నీళ్ళు పెట్టుకోని కత చెప్పింది ఇరుగింటి దీపం.

ఆ కత విన్న దీపాలు వలవలా ఏడ్చినాయి.